నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 183 రంగారెడ్డి | బుధవారం 04 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 04-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

ఓటుపై వేటు వేస్తే సహించం

- అర్హుల ఓటర్ల పేర్లు తొలగిస్తే హక్కుల హాననమే..
- ఎస్ఐఆర్‌పై సందేహాలకు ఆధారాలతో సమాధానమివ్వాలి
- రాహుల్ గాంధీ పోరాటానికి అండగా ఉంటాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి : ప్రజల ఓటు హక్కుకు గండికొట్టే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన పౌరుల పేర్లను తొలగిస్తే అది వారి హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ప్రజల ఓటుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదని హెచ్చరించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పందించారు. ప్రతి పౌరుడి ఓటుకు రక్షణ కల్పించడం, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం రాజ్యాంగబద్ధ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. సామాన్యుడికి రాజ్యాంగం అందించిన అత్యంత శక్తిమంతమైన ఆయుధం ఓటు అని, అధికారాన్ని అప్పగించడానికి, పాలకులను ప్రశ్నించడానికి, అవసరమైతే వారిని మార్చడానికి ప్రజలకు ఉన్న నిర్ణయాధికారం ఓటు ద్వారానే లభిస్తుందని వివరించారు. అలాంటి ఓటు హక్కుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదన్నారు.

ముంపు భూములకు పరిహారం చెల్లింపునకు సిద్ధం !

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై సీఎం రేవంత్ సమీక్ష..
మహారాష్ట్రతో నిరంతర సంప్రదింపులు జరపాలని ఆదేశం..
ముంపు భూముల వివరాలు, గత ఒప్పందాల పత్రాలు అందజేయాలని సూచన..
పరిహారం కోసం జాయింట్ అకౌంట్‌లో నిధులు..



హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి : తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని తన నివాసంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతి, మహారాష్ట్రతో సమన్వయం, ముంపు భూముల వివరాలు, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై చర్చించారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర పత్రాలను మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని అధికారులకు సూచించారు. ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాలపై మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సాంకేతిక లేదా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించినా అభ్యంతరం లేదని సీఎం స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని, మహారాష్ట్ర అధికారులకు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. పరిహారం చెల్లింపులకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేసీఆర్ పేదలను పట్టించుకోలేదు

- బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర సంపదను కొల్లగొట్టారు
- ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చాం..
- మరిన్ని కల్పిస్తాం: మంత్రి పొంగులేటి



నిర్భయవార్త ప్రతినిధి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో తొమ్మిదిన్నరేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన నాయకులు పేదల కష్టాలను పట్టించుకోలేదని ఆరోపించారు. స్వార్థం, స్వలాభం కోసం రాష్ట్ర సంపదను కొల్లగొట్టి ప్రజలను పేదరికంలోకి నెట్టారని మండిపడ్డారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని పొంగులేటి విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులు వరి సాగు చేస్తే ఉరి వేసుకోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన పంటకు బోనస్ అందించి అండగా నిలిచిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు కల్పించామని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు.

ప్రతి గ్రామంలో భూసర్వే

రాష్ట్రంలో అర్హులైన పేదలకు 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. సుమారు 120 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి భూహక్కుదారులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. మ్యాప్‌లతో కూడిన సమగ్ర భూసర్వే ద్వారా ప్రతి భూస్వామికి భూధార్ అందిస్తామని స్పష్టం చేశారు. ఆధార్ తరహాలోనే భూములకు కూడా ప్రత్యేక గుర్తింపు ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మండలి ప్రాంగణ అభివృద్ధికి ప్రణాళికలు

- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన సీఎస్ సంజయ్ జాజు
- పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యం



నిర్భయవార్త ప్రతినిధి : రాష్ట్ర శాసన మండలి ప్రాంగణంలో ప్రతిపాదించిన అభివృద్ధి, సుందరీకరణ పనుల ప్రణాళికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం పరిశీలించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, ప్రతిపాదిత పనులకు గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్‌తో పాటు శాసనసభ, శాసన మండలి కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాసనసభ ప్రాంగణానికి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, అనుబంధ భవనం ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి అంశాలపై సమీక్షించారు.

అధికారుల నుంచి వివరాల సేకరణ

ప్రస్తుతం పర్యాటక శాఖకు చెందిన భూమిని శాసనసభకు బదిలీ చేయడంతో పాటు, పక్కనే ఉన్న డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమిని కూడా శాసనసభకు బదిలీ చేసే ప్రతిపాదనపై చర్చించారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలను పరిశీలించారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు, స్థల పరిస్థితులు, ఇంజినీరింగ్ అంశాలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రతిపాదిత అభివృద్ధి పనుల్లో పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న పచ్చదనానికి ఎలాంటి విఘాతం కలగకుండా, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తగ్గేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మాధవి, ఈఈ మనోహర్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం దారుణం..

- తమ్ముడి భార్యను హతమార్చిన అన్నలు
- భూమి కోసం బెదిరింపులు.. • ఇంట్లోకి లాక్కెళ్లి గొంతుకోసి హత్య



నిర్భయవార్త ప్రతినిధి : ఆస్తి కోసం కుటుంబ సభ్యులే కిరాతకానికి ఒడిగట్టారు. ఎకరన్నర భూమి విషయంలో తమ్ముడి భార్యను అతడి అన్నలు దారుణంగా హతమార్చిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చింతల్‌తండాలో చోటుచేసుకుంది. భూమిని తమకు ఇవ్వాలని కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్న వారు.. చివరకు ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చింతల్‌తండాకు చెందిన బలరాంకు 12 ఏళ్ల క్రితం సునీత (28)తో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే బలరాంకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఏడాది క్రితం గ్రామంలో పంచాయతీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత పేరిట ఎకరన్నర భూమిని పట్టా చేయించారు. ఈ నిర్ణయం బలరాం అన్నలు పాండు నాయక్, మన్యానాయక్‌లకు నచ్చలేదు. ఎలాగైనా ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో భార్యాభర్తలు కలిసి కాపురం చేయకుండా అడ్డుపడుతూ, బలరాంను తరచూ తమ వెంట హైదరాబాద్‌కు తీసుకెళ్లేవారు. దీంతో విసిగిపోయిన సునీత పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో నెల రోజుల క్రితం చింతల్‌తండాలో సునీతకు ఇల్లు నిర్మించి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉంటోంది. అయినప్పటికీ బలరాం అన్నలు సునీతను వదలలేదు. ఆమె ఇంటికి వెళ్లి భూమిని తమకు ఇవ్వాలని, ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరించారు. లేదంటే చంపేస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

ఇంట్లోకి లాక్కెళ్లి హత్య

ఈ నేపథ్యంలో నవంబర్ 2న మధ్యాహ్నం పాండునాయక్, మన్యానాయక్, పాండు భార్య పార్వతి, మామ మాణిక్యనాయక్ కలిసి సునీతపై దాడి చేసినట్లు సమాచారం. ఆమె గొంతుకు పంచె కట్టి తమ ఇంటికి లాక్కెళ్లారు. అనంతరం కత్తులతో గొంతు కోసి దారుణంగా హతమార్చారు. ఆస్తి వివాదం చివరకు ప్రాణాలు తీసే స్థాయికి చేరడంతో చింతల్‌తండాలో విషాదం నెలకొంది.

నిర్భయవార్త

సంపాదకీయం

బుధవారం 04 నవంబర్ 2026

ప్రజాస్వామ్యం అపహాస్యం.

నగర, పుర పాలికలకు ఆదివారం జరిగిన పోలింగ్ సందర్భంగా అధికారపక్ష?ం బహిరంగ బరితెగింపునకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేసింది. పోలింగ్ కేంద్రాల ఆక్రమణ, రిగ్గింగ్, ప్రతిపక్ష పార్టీల ఏజెంట్ల గెంటివేత, అపహరణలు, గృహ నిర్బంధాలు, అభ్యర్థులపై దాడులు, ఓటర్ల అడ్డగింత, యథేచ్ఛగా దొంగ ఓట్లు, ప్రలోభాలు... ఒకటేమిటి అన్ని రకాల అరాచకాలకు, టక్కు టమార గజ కర్ణ గోకర్ణ విద్యలకు కూటమి ఎలాంటి జంకు గొంకు లేకుండా పాల్పడింది. ఈ దారుణాలన్నీ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా ప్రసారమయ్యాయి. అమాంబాపతు అక్రమాలను దగ్గరుండి చేయించింది కూటమి మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర నాయకులు. ఈ దౌర్జన్యాలు బహిరంగ రహస్యాలు. ప్రభుత్వ పెద్దల అండ ఉండటంతో అధికారులు, పోలీసులు అడ్డుకోకుండా చోద్యం చూశారు. కొన్ని చోట్ల వాళ్లే వత్తాసు పలకడం రాజ్యం, ఎన్నికల వ్యవస్థ కూడబలుక్కొని తలపెట్టిన దుర్మార్గం. అర్బన్ లోకల్‌బాడీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజునే అధికార పక్షం హింసను ప్రేరేపించింది. సుప్రీం కోర్టు జోక్యంతో నామినేషన్ల స్వీకరణకు గడువు పెంపు, ఆ వరసలో పోలింగ్, కౌంటింగ్ తేదీల మార్పునకు ఎస్ఇసి దిగి రావాల్సి వచ్చింది. ఈ అనుభవంతోనైనా ఎస్ఇసి పోలింగ్‌నకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుందని అందరూ ఆశించారు. ఆదివారం పోలింగ్ సందర్భంగా చెలరేగిన ఉద్రిక్తతలనుబట్టి ఎస్ఇసి చేష్టలుడిగి తోలుబొమ్మ అయిందని అర్థమవుతుంది.పులివెందుల, కడప, మదనపల్లె, చిత్తూరు, చీమకుర్తి, మాచర్ల, చిలకలూరిపేట, తాడిపత్రి, తిరుపతి, అనంతపురం, గుంటూరు, విజయవాడ, ఇంకా అనేక చోట్ల అధికారపక్షం అమానుషాలకు ఒడిగట్టిందని ఎస్ఇసికి, పోలీసులకు ఫిర్యాదులందాయి. పులివెందులలో 80 పోలింగ్ కేంద్రాలకుగాను 70 చోట్ల ప్రధాన ప్రతిపక్ష వైసిపి ఏజెంట్లు లేకుండా పోలింగ్ ఎలా జరుపుతారని ఆ పార్టీ చీఫ్, మాజీ సిఎం జగన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏజెంట్లతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేశారు. మరోవైపు ఎస్ఇసి కార్యాలయం ఎదుట కూడా పలు ఫిర్యాదుల పరిష్కారం కోసం ఆందోళనలు జరిగాయి. డోన్, బేతంచర్లలో అధికారపార్టీ ఎంఎల్ఎ ఆధ్వర్యంలో యథేచ్ఛగా బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ జరిగింది. అడ్డుకోబోయిన సిపిఎం అభ్యర్థులు, కార్యకర్తలను చెదరగొట్టారు. రౌడీషిట్ వంటి ఆరోపణలతో గృహనిర్బంధం చేశారు. తిరుపతిలో దొంగ ఓట్ల కలకలం లేచింది. వేరే ప్రాంతాల నుంచి ఫేక్ ఓటర్లను పెద్ద ఎత్తున రప్పించారు. ఇవన్నీ స్వల్ప సంఘటనలుగా ఎస్ఇసి, డిజిపి కొట్టిపారేశారు. చాలా ఆరోపణలకు ఆధారాల్లేవని ఫిర్యాదులను తిరస్కరించారు. అర్ధరాత్రి దాటాక రాష్ట్ర వ్యాప్తంగా 12 వార్డులలోని 13 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఆదేశించారు. సోమవారంనాటి రీపోలింగ్‌నకు సైతం ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసే వాతావరణం కల్పించలేకపోవడాన్నిబట్టి ప్రభుత్వ ప్రభావానికి ఎస్ఇసి లోనైందని భావించాలి.ఇన్ని వేల మంది సిబ్బంది, అన్ని వేల మంది పోలీసులు, సిసి కెమెరాల నిఘా, వెబ్‌కాస్టింగ్ పోలింగ్‌ను సజావుగా జరిపించలేకపోవడం ఎస్ఇసి, పోలీస్ ఘోర వైఫల్యాన్ని తెలుపుతుంది. అధికార దుర్వినియోగానికి ఆ వ్యవస్థలు గేట్లు ఎత్తి లైసెన్స్‌లు ఇచ్చాయని అనుకోవాలి. ఎన్నికలు జరిగిన 92 పట్టణ స్థానిక సంస్థల్లో దాదాపు 96 లక్షలకుపైన ఓటర్లుండగా 60 లక్షల పైచిలుకు ఓటింగ్‌లో పాల్గొన్నట్లు ఎస్ఇసి అధికారికంగా వెల్లడించింది. పోలింగ్ శాతం 62.16 శాతం. గొడవలు జరిగిన తిరుపతిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 46.85 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్, రీపోలింగ్ దృశ్యాలు పోలైన ఓట్లు నిజమైన ప్రజాభిప్రాయానికి ప్రతిరూపం కాదు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాలంటే తాము ఏం చేస్తామో చెప్పి ఒప్పించాలి. దౌర్జన్యాలు, దాష్టీకాలు, బెదిరింపులతో భయభ్రాంతులను చేసి కాదు. ప్రజాస్వామ్యం అందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించదు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కు. ప్రజాస్వామ్యంలో అదే కీలకం. ప్రజల ఓటు హక్కును నలిపేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. యథా రాజా తథా ప్రజా అన్నట్లు కేంద్రంలో మోడీ ప్రభుత్వం సిఇసిని తన గుప్పెట్లో పెట్టుకోగా రాష్ట్రంలో కూటమి సర్కార్ ఎస్ఇసిని శాసిస్తోంది. విజ్ఞులు ఆలోచించాలి. అర్బన్ ఓట్ల లెక్కింపు, పరిషత్ ఎన్నికల్లోనైనా ఎస్ఇసి స్వతంత్రంగా వ్యవహరించాలి.

రాష్ట్రాన్ని పీడిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, పర్యావరణ ముప్పు



రాష్ట్రంలో నిరుద్యోగం ప్రబలిపోతున్నది. ఐ.టి పై ఆశలు పెట్టుకున్న యువత నిరాశకు గురవుతున్నది. ప్రతి సంవత్సరం లక్ష మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, 65 వేల మంది డిప్లమా హోల్డర్లు చదువులు పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేస్తే ఐ.టి ఉద్యోగం గ్యారెంటీ అన్న ఆశతో తల్లిదండ్రులు కూడా అప్పులు చేసి మరీ చదువులపై పెట్టుబడులు పెడుతున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినా స్కిల్స్ లేవనే పేరుతో మరలా సర్టిఫికెట్ కోర్సులకు ఏ హైదరాబాదో, బెంగళూరో వెళ్ళి పిజి హాస్టళ్లలో ఉంటూ కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు దాదాపుగా జరగడం లేదు. జరిగినా అప్పాయింట్‌మెంట్ లెటర్ రాదు. లెటర్ ఇచ్చినా బెంచిపై ఉంచడంతో నేర్చుకున్నది కూడా మర్చిపోతామని రాజీనామా చేసి మరోదారి వెతుక్కుంటున్నారు. ఐ.టి జాబ్ మార్కెట్‌లో కొద్దో గొప్పో ఓపెనింగ్స్ ఉన్నా ఏ.ఐ పేరుతో మధ్యంతర దశలో ఉన్న వేలాదిమంది ఉద్యోగులను తొలగించేస్తున్నారు. గత ఆరు మాసాల్లో దాదాపు 2 లక్షల మందిని ఇంటికి సాగనంపారు. తాజాగా మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాపితంగా 60 వేల మందికి విఆర్ఎస్ ఇచ్చారు. అందులో 23 వేల మంది మన దేశీయులే. ఇంకొంత మందిని తొలగిస్తారని అంచనా. టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్, ఫేస్‌బుక్, యాక్సెంచర్ వగైరా కంపెనీలన్నీ ఫైర్ చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఓపెనింగ్స్‌లో కొత్తగా ఒకరిని తీసుకుంటే పాతవారిని పది మందిని తీసివేస్తున్నారు. ఒక ఉద్యోగం వస్తే పది మంది వారిపై ఆధారపడి బతుకుతారని ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలంటూ చంద్రబాబు ఊదరకొడుతున్నారు. అదే ఒకరిని తీసేస్తే పదిమంది ఇంటికి పోతారని మాత్రం చెప్పడం లేదు. నేడు జరుగుతున్నదదే. అప్పులు చేసి చదువుకున్న నిరుద్యోగుల కథ కంచికి చేరుతున్నది. ఈ సంక్షోభంతో ఇంజ నీరింగ్ చదివేవారి సంఖ్య తగ్గిపోయి సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. 65 శాత ం ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారు.ఉద్యోగాలు తీసేస్తే ఒకటి లేదా రెండు నెలలు జీతం ఇచ్చి వంచేస్తున్నారు. అమెరికా లాంటి దేశాలకు వీసాలు దొరకడం బాగా తగ్గిపోయింది. అక్కడున్నవారు కూడా ఉద్యోగాలు ఉంటాయో ఊడతాయో తెలియక, తిరిగి రాలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి స్థితిలో నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంగా మారింది. అందుకే నిరాశా, నిస్పృహల నుండి బయటపడి ఇప్పుడు పోరాట మార్గం పట్టారు. దాన్నే మనం 'నీట్' ఉద్యమ రూపంలోనూ ఇప్పుడు 'సర్' వ్యతిరేక పోరాటంలోనూ చూస్తున్నాం. మన దేశంలోనే కాదు ఫ్రాన్స్, సెర్బియా లాంటి యూరోపియన్ దేశాల్లో, మన ఇరుగు పొరుగు దేశాల్లోనూ అలాంటి పరిణామాల్నే చూస్తున్నాం.

నిరుద్యోగంలో ఆంధ్రాదే అగ్రస్థానం

దేశంలోనే నిరుద్యోగంలో మన రాష్ట్రం మొదటి లేదా రెండవ స్థానంలో ఉంది. జాతీయ స్థాయి నిరుద్యోగం రేటు 5.4 శాతం ఉంటే మన రాష్ట్రంలో 8.3 శాతం ఉంది. అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాలతో సహా మన దేశంలోనూ నిరుద్యోగం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త తరం యువతలో (జెన్-జి) నిస్పృహ పెరుగుతున్నది. పెట్టుబడిదారీ పోటీ ప్రపంచంలో ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసి మానవ శ్రమని తగ్గించుకుంటూ పోతుంటారు. ఏ.ఐ పరిణామ క్రమం కూడా అందులో భాగమే. దీనిని ఉద్యోగాల తొలగింపునకు ఉపయోగించొచ్చు లేదా ఉద్యోగాల నియామకానికి ఉపయోగించుకోవచ్చు. అది ఆయా దేశాల సామాజిక పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. మనలాంటి దేశాల్లో ప్రభుత్వ రంగం బలహీనపడి ప్రైవేటు రంగం విస్తరిస్తున్న దశలో లాభాలే పరమావధిగా మానవ (శారీరక, బౌద్ధిక) శ్రమను దోచుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలు, లేబర్ కోడ్స్ దీనికోసమే రూపొందించబడ్డాయి. సామాజిక బేరసారాలాడకుండా ఎవరికి వారు వారి జీతభత్యాల గురించి ఆలోచించే విధంగా ఉద్యోగ విధానాల్లో మార్పు తీసుకువచ్చారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్, ఫిక్స్‌డ్ టర్మ్ వగైరావన్నీ ఇలాంటివే. ఏ ఉద్యోగమూ దొరకనివారు స్విగ్గీ, ఓలా లాంటి గిగ్ లేదా ప్లాట్‌ఫాం తరహా అస్థిరమైన వివిధ రకాల పనులు చేస్తున్నారు. క్రమంగా వాటికి కూడా డిమాండు పెరిగి నిరుద్యోగులు పోటీ పడుతుండడంతో హీనమైన వేతనాలకు కూడా గొడ్డుచాకిరి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీలు, మహిళల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది.

ఉద్యోగాలు కాదు భ్రమలు సృష్టిస్తున్నారు

యువతరంలో వస్తున్న ఈ అసంతృప్తిని పాలకవర్గాలు ఉపయోగించుకొని డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ అధికారాన్ని కేంద్రీకరించుకుంటున్నాయి. అవిగో ఉద్యోగాలు, ఇదిగో ఉపాధి అంటూ పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వచ్చేస్తున్నాయి, లక్షల సంఖ్యలో ఉద్యోగాలిస్తామని భ్రమలు పెడుతున్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, లోకేష్ విద్యాశాఖా మంత్రిగా రావడంతో నిరుద్యోగుల్లో ఆశలు మరింతగా పెరిగాయి. కానీ ఈ రెండున్నర సంవత్సరాల్లో ప్రకటనలు, ప్రణాళికలు తప్ప ఉద్యోగాలు ఇచ్చింది లేదు. ఎం.ఒ.యు లు తప్ప పెద్దగా పెట్టుబడులూ వచ్చింది లేదు. ఇండస్ట్రియల్ పార్కులు, కారిడార్‌లు అంటూ దీర్ఘకాలిక ప్రణాళికలతో రోజూ మోత మోగిస్తున్నారు తప్ప అవి ఎప్పటికి వాస్తవ రూపం ధరిస్తాయో ఎవరూ చెప్పలేకున్నారు.రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలు పడి ఆఫర్‌లు ఇస్తున్నా భూములు, నబ్సిడీలు, రుణాలు తీసుకుంటున్నారు తప్ప పరిశ్రమలు పెట్టడం లేదు. తాజాగా హెచ్.పి కంపెనీ ఎన్.ఇ.జెడ్ నుండి ఉపసంహరించుకున్నది. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సరైన ప్రోత్సాహం లేక మూత పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీలు రూ.5 వేల కోట్లు 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. సహకార చక్కెర ఫ్యాక్టరీలు, నూలుమిల్లులు, డెయిరీలు మూత పడుతున్నాయి. టెక్స్‌టైల్స్ సంక్షోభంలో ఉంది. ఫలితంగా నిరుద్యోగం మరింత ఎక్కువగా పెరుగుతున్నది. రాష్ట్రంలో 29 చక్కెర ఫ్యాక్టరీలుండగా అందులో 27 మూతపడి 2 మాత్రమే నడుస్తున్నాయి. వాటిలో మరొకటి ఎప్పుడైనా మూతపడొచ్చు. వీటిల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఇప్పటికీ సరైన పరిహారం అందలేదు.

కాలుష్యంతోనే ఎల్‌నినో

భారతదేశం డంప్ యార్డుగా మారుతున్నది. ఉపాధి కల్పించలేని డేటా సెంటర్లకు పెద్దపీట వేస్తున్నదీ ప్రభుత్వం. ఉద్యోగాలు కల్పిస్తామని భ్రమలు పెట్టి మన భూములు, విలువైన, అరుదైన ఖనిజాలు, నీరు, గాలి, సూర్యరశ్మి వగైరా సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలు కొల్లగొడుతున్నాయి. ఫలితంగా వర్యావరణానికి ఎనలేని ముప్పు ఏర్పడుతోంది. దాని దుష్ఫలితమే ఎల్‌నినో. వర్షాలు లేవు. వంటలు పండలేదు. కాన్సర్, కిడ్నీ లాంటి వ్యాధులు పెరుగుతున్నాయి. మురుగు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. చిన్నపాటి వర్షాలు వచ్చినా పట్టణాలు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేక దోమలు ముసురుకుంటున్నాయి. నదులు పారిశ్రామిక కాలుష్యంతో నిండిపోతున్నాయి. మంచినీరు దొరక్క కొనుక్కోవాల్సిన దుస్థితి వచ్చింది. మానవజాతి మనుగడకు నేడు పర్యావరణ పరిరక్షణ ముఖ్యమైన ఎజెండాగా మారింది. అందుకే డేటా సెంటర్లు, అణు విద్యుత్ కేంద్రాలు, రసాయన పరిశ్రమలకు వ్యతిరేకత పెరుగుతోంది.

ఆదాయ వ్యత్యాసాలే అసలు సమస్య

ఉన్న పరిశ్రమలు మూతపడడం, కొత్త పరిశ్రమలు రాకపోవడం, సర్వీసు రంగం వెనకబడడం, వ్యవసాయ సంక్షోభం తదితర కారణాలతో ప్రజలకొచ్చే ఆదాయ వనరులు బాగా తగ్గిపోయాయి. వేతనాలు పెరగడం లేదు. కొనుగోలు శక్తి పడిపోయింది. ఇంకోవైపు ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక సాగు సంక్షోభంలో పడింది. గ్రామీణ ప్రజల ఆదాయాలు పడిపోయాయి. ఇప్పటి వరకు మార్కెట్ విస్తరణకు ఆలంబనగా ఉన్న గ్రామీణ ప్రాంతాలో ఆదాయాలు తగ్గి సంక్షోభంలో పడ్డాయి. వ్యవసాయోత్పత్తి దెబ్బ తినడంతో ఆహార ఉత్పత్తులను బ్లాక్ మార్కెట్‌కి తరలించి పెద్ద ఎత్తున నిల్వ చేసుకొని ఒక్కసారిగా ధరలు పెంచేస్తున్నారు. గత రెండు మాసాల్లోనే 50 శాతం ధరలు పెరిగాయి. ప్రాజెక్టుల కింద వరి విస్తీర్ణం తగ్గడంతో బియ్యం ధరలు కొండెక్కాయి. రెండు మాసాల క్రితం కిలో రూ.45 ఉన్న ఫైన్ వెరైటీ ఇప్పుడు రూ.65, సోనా రూ.70, ఫైన్ వెరైటీ రూ.80, సూపర్ ఫైన్ రూ.100 కు చేరుకుంది. ఉల్లిపాయలు 100 శాతం పెరిగాయి. పాలు, చక్కెర, నూనె, చింతపండు, పప్పులు, సబ్బులు వగైరా నిత్య జీవితావసరాలన్నీ అమాంతం పెరిగిపోయాయి. మందుల ధరలు పెరిగాయి. షుగర్, బిపి వ్యాధిగ్రస్తుల బడ్జెట్ పెరిగింది. ఆరు మాసాల క్రితం 4.6 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం రేటు నేడు 6.7 శాతానికి పెరిగింది. అంటే 50 శాతం ద్రవ్యోల్బణం రేటు పెరగడం అసాధారణమైన విషయం. ప్రజల ఆదాయాలు తగ్గి ధరలు పెరగడం వల్ల నిత్యావసరాలు కుదించుకోలేక అప్పులు పెరిగిపోతు న్నాయి. ముఖ్యంగా మధ్యత రగతి కుటుంబాలు దీనిని భరించలేక పిల్లలతో సహా ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల బాగా పెరిగాయి. ఇంతకు ముందు రైతు ఆత్మహత్యలే చూశాము. ఇప్పుడు చిన్న వ్యాపారుల, మధ్యతరగతి ప్రజల ఆత్మహత్యలు కూడా చూస్తున్నాము. అటు ర్యాంకుల కోసం ప్రైవేటు విద్యాలయాలు ఇటు తల్లిదండ్రులు ఒత్తిడి భరించలేక జీవితంపై విరక్తితో విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తుంది. ఈ పరిణామం ఒక సామాజిక సమస్యగా మారింది.

ఉరకలెత్తుతున్న జెన్-జి చైతన్యం

ఈ స్థితిలో కొత్త తరం జెన్-జి ఆకాశం నుండి భూమికి దిగుతున్నది. రానున్న నవతరం (జెన్-ఆల్ఫా) కూడా తిరుగుబాటుకు సిద్ధమవుతున్నది. ఈ అసమ్మతి నుండే సిజెపి ఆవిర్భవించింది. విద్యార్థి సంఘాల నుండి సమరశీల నాయకత్వం ముందుకొచ్చింది. కొత్త తరంలో వస్తున్న చైతన్యాన్ని దెబ్బకొట్టి వారిని నిరాయుధుల్ని చేయడానికి ఓటు హక్కును లాగేసుకుంటున్నారు. 'సర్' పేరుతో జరుగుతున్న తతంగంలో మైనారిటీలు, వలస కూలీలే కాదు...కొత్త తరం ఓటర్లు సైతం తొలగించబడుతున్నారు. కర్ణాటకలో తాజాగా 64 లక్షల మంది ఓటర్లను తొలగిస్తే అందులో 38 లక్షల మంది 30 సంవత్సరాల లోపు వారు కావడం గమనార్హం. మన రాష్ట్రంలో ఇంత వరకు లెక్కలే ప్రకటించలేదు. యువతరంలో వస్తున్న అసమ్మతిని భరించలేని మోడీ, చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కారు ఆందోళనలపై బుల్డోజర్లు తోలుతున్నది.ఒకవైపు నిర్బంధం మరోవైపు మనువాద, మతోన్మాద భావజాలంతో యువతరాన్ని బ్రెయిన్ వాష్ చేయడానికి మోడీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ పరివారం కలిసికట్టుగా ప్రయత్నిస్తున్నాయి. కేంద్రానికి లొంగిపోయిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి వారు కూడా వీరికి భజన చేస్తున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం విజయవంతమైనా, 'నీట్' వ్యతిరేక పోరాటం ద్వారా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినా, ప్రస్తుత 'సర్' వ్యవహారంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలిస్తున్నా ప్రజా ఉద్యమాల ఒత్తిడి ఫలితమే. ముఖ్యంగా సాధారణ మధ్యతరగతి యువతే కాకుండా బిజెపి, ఆర్ఎస్ఎస్ కుటుంబాల్లోని యువతీ, యువకులు కూడా ఇలాంటి ఉద్యమాల్లో పాల్గొనడానికి ధైర్యంగా ముందుకొస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ లాంటి భయాల నుండి బయటపడుతున్నారు. ధైర్యంగా ఉద్యమిస్తున్న యువ తరానికి కార్మిక, కర్షక తదితర కష్టజీవుల నుండి సంఘీభావం వ్యక్తమవుతున్నది. అనేకమంది తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఉద్యమాల్లోకి పంపడానికి ప్రోత్సహిస్తున్నారు. ఇదొక కొత్త పరిణామం. గత 35 సంవత్సరాల్లో రాజకీయ రహితం కావించబడ్డ తరానికి భిన్నమైన కొత్త తరం కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నది. ఈ మార్పును ముందుకు తీసుకుపోవడమే నేడు ప్రగతిశీల శక్తుల ముందున్న కర్తవ్యం.

క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసి పోలీసు ఉద్యోగాలు సాధించాలి

పోలీస్ శిక్షణ తీసుకుంటూనే కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధం కావాలి ఐటీడీఏ పీవో బి.రాహుల్







భద్రాచలం నవంబర్ 3 నిర్భయ వార్త ప్రతినిధి. నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు పోలీసు ఉద్యోగాలు సాధించుకొని జీవితంలో స్థిరపడడానికి ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ శిక్షణను యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శిక్షణ తీసుకుంటున్న యువతీ యువకులకు సూచించారు. మంగళవారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సి భవనం సమావేశ మందిరంలో ఐటీడీఏ ద్వారా నడపబడుతున్న పోలీస్ కోచింగ్ క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన యువతి యువకులకు ఫ్యాకల్టీలు బోధిస్తున్న చరిత్ర అంశాలు మరియు అందిస్తున్న సూచనలను వారితో కలిసి కూర్చొని ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణ అందుకునే యువతి యువకులు ఫ్యాకల్టీలు, కోచులు, శిక్షణ మరియు చరిత్రకు సంబంధించిన అంశాలు అలాగే స్వాతంత్ర ఉద్యమాలలో పాల్గొన్న మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, ఖాన్ అబ్దుల్ ఘఫ్ఫార్ ఖాన్ (సరిహద్దు గాంధీ), సరోజినీ నాయుడు చరిత్రను బోధించేటప్పుడు తప్పనిసరిగా నోట్స్ రాసుకుంటూ పాయింట్ల వారిగా గుర్తుంచుకోవాలని, అలాగే గతంలో నేర్చుకున్నది ఈరోజు నేర్చుకున్నది రాత్రిపూట మరలా మననం చేసుకుంటూ ఉంటే జ్ఞాపక శక్తి పెరిగి పరీక్షల సమయంలో ఎటువంటి భయాందోళనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చని ఆయన అన్నారు. పోలీస్ శిక్షణతో పాటు కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన అంశాలను ఫ్యాకల్టీల చేత అడిగి తెలుసుకోవాలని, సమయం వృధా చేయకుండా తక్కువ సమయంలో ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ తీసుకొని అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆయన అన్నారు. పోలీసు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం పెట్టుకున్న యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని పోలీస్ శాఖలో ఉద్యోగం సంపాదించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటిసి ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, ఏసీఎంవో రమేష్, కేర్ టేకర్ సర్వేశ్వర్ దొర, వార్డెన్ మోహన్, పీడీలు వసంతం, పార్వతి యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్


మైనర్లకు వాహనాలు ఇచ్చినా, లైసెన్స్ లేకుండా నడిపినా కఠిన చర్యలు తీసుకోవాలి



కూకట్‌పల్లి, నవంబర్ 3 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ మంగళవారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల పరిరక్షణ, అధికారుల పనితీరు, ట్రాఫిక్ విధుల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్-2 శేషాద్రి రెడ్డి, ఐపీఎస్, ఏడీసీపీ ట్రాఫిక్-2 వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ తిమ్మప్పతో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మురసు తుఫాన్ హెచ్చరికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం నవంబర్ 3 నిర్భయ వార్త ప్రతినిధి. మురసు తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో 48 గంటల పాటు వర్షాలు పడే సూచనలు ఉన్నందున సమస్యాత్మక ప్రాంతాలలోనీ సమస్యలు తెలియజేయడానికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో తుఫాన్ హెచ్చరికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ఠ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం డివిజన్లోని మండలాలు గ్రామాలలో మురసు తుఫాన్ కారణంగా ఏమైనా సమస్యలు ఉంటే సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08743-232444, ఫోన్ చేసి సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. మురసు తుఫాన్ ప్రభావం వలన 48 గంటల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సమస్యాత్మక గ్రామాల ప్రజలు వర్షాలు తగ్గేవరకు ఇండ్లలోనే ఉండాలని, అత్యవసరం లేకుండా బయటకు వెళ్లడం నివారించి సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని అన్నారు. అనవసరపు ప్రయాణాలు పూర్తిగా మానుకోవాలని, అత్యవసరం లేకుండా ప్రయాణాలు చేయకూడదని, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయవలసి ఉంటే తగు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణాలు చేయాలని అన్నారు. నీటి వనరుల వద్దకు వెళ్లకూడదని, ముఖ్యంగా చేపల వేట, ఈత కొట్టడం, స్నానం వంటి కార్యకలాపాల కోసం నదులు, వాగులు, చెరువులు, కుంటలు, జలాశయాల వద్దకు వెళ్లడం మానుకోవాలని అన్నారు.

పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు... రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

2వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి



ఖమ్మం నవంబర్ 03 నిర్భయవార్త రిపోర్టర్. పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ళని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ తో కలిసి తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో 2 వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో రెండో విడత క్రింద 187 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదవారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు కట్టించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో 810 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు దాదాపు 700 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండో విడత కింద ఇళ్లను అందజేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేది విడతలతో ముగిసేది కాదని, అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అందేవరకు నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హౌ

టిఎస్ మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో భాగంగా దాదాపు 810 ఇళ్లు మంజూరు చేయబడ్డాయని, ఇందులో 600 ఇళ్లు పూర్తిగా పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా పూర్తి చేసుకున్నారన్నారు. మరో 100 ఇళ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని, వీటిలో స్లాబ్ వేసిన ఇళ్లు 60 వరకు ఉండగా, ఇటీవల కొత్తగా సాంక్షన్ రావడం వలన త్వరలో పనులు ప్రారంభించనున్న మరో 90 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. రెండవ విడతలో భాగంగా అదనంగా మరో 185 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతోందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం కింద పూర్తిగా అర్హత ఉన్న నిజమైన పేదలను మాత్రమే పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్లు, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారు ఇళ్లు కట్టుకుంటున్న దశలను బట్టి ఫోటో తీస్తే చాలు, నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పారదర్శకమైన విధానం అమలవుతోందని అన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో నమ్మకం, డిమాండ్ మరింత పెరిగిందని తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్ల లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మంత్రి తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెం గ్రామంలో ఎన్. నగేష్ - మంగమ్మ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం చేసి, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఏలువారిగూడెం గ్రామంలో తెట్టెంపాడు-బీరోలు రోడ్డు నుండి ఏలువారిగూడెం వరకు రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, బీరోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 48 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శేఖర్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ జి. వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు వినోద, గుగులోతు తులసి నర్సింహ, గుమ్మడి దేవభిక్షం, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పోడు జోలికొస్తే పోరాటం తప్పదు

మూల ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి. ఆదివాసి రక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్దం నందా.



చర్ల నవంబర్ 03 నిర్భయవార్త ప్రతినిధి చర్ల మండలంలో ఆదివాసి రక్షణ సంఘం నాయకత్వం పలు లోతట్టు అటవీ గ్రామాలు కొండేవాయి,కోర్కట్పాడు, రాళ్ళాపురం వంటి పలు గ్రామాలలో పర్యటించడం జరిగింది ఈ పర్యటనలో ఆదివాసి రక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్దం నంద పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మూల ఆదివాసులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు మూల ఆదివాసులను ఎస్టి లు కాదు అని అంటూ కుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేయడం భావితరాల భవిష్యత్తును నాశనం చేస్తుందని అన్నారు బ్రతుకుతెరువు అయిన పోడు భూమిని ఆదివాసీల నుండి లాక్కోవాలని చూడడం ఇక్కడి నుండి వెళ్లగొట్టాలని ప్రయత్నించడం మానుకోవాలని తెలిపారు ఫారెస్ట్ అధికారులు ఆదివాసీల పట్ల వారి పోడు భూముల పట్ల దురుసుగా వ్యవహరించే పద్ధతిని మానుకోవాలని కోరారు లేకపోతే పోరాటం తప్పనిసరీ పరిస్థితి ఉంటుంది అన్నారు ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసి రక్షణ సంఘం నిరంతరం ప్రజాస్వామ్య బద్దంగా ఉద్యమిస్తుందని తెలిపారు మనకోసం జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డ తప్పకుండా పాల్గొనాలని ఐకమత్యంతో మన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే దిశగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు ఈ కార్యక్రమంలో భారత్, ఇడిమి, కోసి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఎత్తివేతకు అఖిలపక్ష కార్యాచరణను స్వాగతిస్తున్నాం

109 రోజుల ప్రణాళికను 30 రోజులకు కుదించాలి.. జేఏసీ డిమాండ్

12 డిమాండ్లతో అఖిలపక్షానికి వినతిపత్రం అందజేత



జవహర్‌నగర్ నవంబర్ 03 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి మేడ్చల్ జిల్లా నాగారం ఎంవైఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశాన్ని, అందులో ప్రకటించిన కార్యాచరణ ప్రణాళికను జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ స్వాగతిస్తోందని కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ తెలిపారు. అయితే ప్రకటించిన 109 రోజుల కార్యాచరణ ప్రణాళికను 30 రోజులకు కుదించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అఖిలపక్ష కార్యాచరణపై తమ అభిప్రాయాలు, భవిష్యత్ కార్యాచరణను వారం రోజుల తర్వాత నిర్వహించే సమావేశంలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.27 ఏళ్లుగా పరిష్కారం కాని డంపింగ్ యార్డు సమస్యపై అధికార పార్టీ చొరవ తీసుకుని అఖిలపక్ష సమావేశం నిర్వహించడం స్వాగతించదగిన విషయమని వారు అన్నారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందుల కోణంలో చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తమ కమిటీ తరఫున 12 డిమాండ్లతో కూడిన వైఖరి పత్రాన్ని అఖిలపక్షానికి అందజోసి నట్లు వెల్లడించారు.డంపింగ్ యార్డును ఆధునికీకరణ పేరుతో అదే ప్రాంతంలో కొనసాగించకుండా శాశ్వతంగా ఎత్తివేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన చేసి, ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లక్షల టన్నుల పేరుకుపోయిన పాత చెత్తను 12 నెలల్లో బయోమైనింగ్ ద్వారా తొలగించి, ఆ ప్రాంతాన్ని బయోడైవర్సిటీ పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. 15 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు రూ.20 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలని సూచించారు. బాధిత ప్రాంతాల ప్రజలకు ఆస్తిపన్ను మాఫీ, మెరుగైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలు, మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే సుమారు 3 వేల మంది వ్యర్థాల సేకరణ కార్మికులకు జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై విభాగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని, బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేదా రూ.50 లక్షల పరిహార ప్యాకేజీ అందించాలని కోరినట్లు తెలిపారు. అఖిలపక్షం ప్రకటించిన 109 రోజుల కార్యాచరణ కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, డంపింగ్ యార్డు శాశ్వత ఎత్తివేతకు దోహదపడాలని వారు పేర్కొన్నారు. ఇందుకోసం జవహర్‌నగర్ జేఏసీ సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. అఖిలపక్ష సమావేశం నిర్ణయించిన వారం రోజుల గడువులోగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, బాధిత ప్రాంతాల ప్రతినిధుల భాగస్వామ్యంతో శాశ్వత అఖిలపక్ష సాధన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి నెలా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించి, డంపింగ్ యార్డు ఎత్తివేతకు ప్రభుత్వం వేగవంతమైన చట్టపరమైన



చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి జేఏసీ కో-కన్వీనర్లు టీఆర్ఎస్‌కు చెందిన మేక లలిత యాదవ్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు గడ్డం సదానందం, సీపీఐ దర్శనం యాదగిరి, సీపీఎం శివన్నారాయణ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహ్మద్ పాషామియా, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, టీయూసీఐ వి.ప్రవీణ్, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, ఏఐటీయూసీ అంబాల ఎల్లయ్య, సీఐటీయూ నర్సింహులు, శ్రావణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

ఘనంగా తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజు జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు.



కారేపల్లి నవంబర్ 3 నిర్భయవార్త రిపోర్టర్. తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజు జన్మదిన వేడుకలను సింగరేణి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి సోమందుల నాగరాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యమకారుల పాత్ర చిరస్మరణీయమని, ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న సోమందుల నాగరాజు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు డొంకెన రవీందర్, జడల కళ్యాణ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సంపత్, రాము, ఉపేందర్, సత్యనారాయణ, వీరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోళ్లు షురూ



నారాయణ్ ఖేడ్ నిర్భయవార్త ప్రతినిధి : నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట మండల కేంద్రంలో డీసీసీబీ ఆధ్వర్యంలో కమలాపూర్ సొసైటీ ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెదక్ జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ 2,461/ సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ 2,441/ చెల్లించనున్నట్లు తెలిపారు.రైతులు దళారుల బారిన పడకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు సకాలంలో మద్దతు ధర అందేలా సంబంధిత అధికారులు, సొసైటీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు.కార్యక్రమంలో మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు,డీసీసీబీ అధికారులు,సొసైటీ ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

టపాసుల దుకాణాలలో భద్రతా ప్రమాణాల్లో రాజీ పడొద్దు

ఖమ్మం, నవంబర్ 03 నిర్భయవార్త రిపోర్టర్ దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి దీపావళి పండుగ వేడుకలు, టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో టపాసుల విక్రయాలు, వినియోగం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సాధారణంగా దీపావళి తర్వాత వారం రోజుల వరకు కూడా టపాసులు కాల్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు అగ్నిమాపక, వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.టపాసుల దుకాణాల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టాలని అన్నారు. టపాసుల దుకాణాలను బహిరంగ ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలని, తాత్కాలిక నిర్మాణాల ఏర్పాటులో మండే స్వభావం కలిగిన పదార్థాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని, దుకాణాల మధ్య తగినంత ఖాళీ స్థలం ఉండేలా చూడాలని, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ప్రతి దుకాణంలోని విద్యుత్ వైరింగ్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, ఇతర అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచడంతో పాటు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు టపాసుల విక్రయ కేంద్రాల వద్ద 108 వాహనాన్ని



అందుబాటులో ఉంచాలని, ప్రథమ, ద్వితీయ స్థాయి కాలిన గాయాలకు అవసరమైన మందులు, వైద్య చికిత్సలను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం, పరిసరాల పరిశుభ్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి, దీపావళి వండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

వ్యాపార లాభాల కంటే ప్రజల భద్రతే ముఖ్యమని, ఆదాయం కోసం భద్రతా ప్రమాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రెండు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, నగరంలో మరో అనువైన బహిరంగ ప్రదేశం ఉంటే అధికారులు గుర్తించి తెలియజేయాలని, అక్కడ కూడా దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు పర్యావరణానికి హాని కలిగించని గ్రీన్ క్రాకర్స్ మాత్రమే వినియోగించాలని, కాలుష్యాన్ని పెంచే టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు. దీపావళి వేడుకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఏసీపీ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు 224 దరఖాస్తులు అందాయని, అందుబాటులో ఉన్న దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, డీపీఓ వినోద్ కుమార్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, టపాసుల దుకాణాల యజమానులు, విక్రయదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు



సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి :సంగారెడ్డి జిల్లాసదాశివపేట మండలంలోని భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో విజేతలకు మండల విద్యాధికారి ఎన్. శంకర్ గారి చేతుల మీదుగా తేదీ: 03.11.2026 న బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. విద్యార్థులందరికీ పార్టిసిపేట్ సర్టిఫికెట్, మెమెంటో, మెడల్స్ అందజేశారు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మండల విద్యాధికారి మాట్లాడుతూదివ్యాంగ విద్యార్థులు ఎంతో ప్రతిభ కలవారని, వారిని ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఏ క్షణంలోనూ సహనం కోల్పోవద్దని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలనువినియోగించుకోవాలని తల్లిదండ్రులకు వివరించారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు శ్వేతా నవీన లాహిక్ ఉపాధ్యాయులు ప్రభు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా గెలుపొందిన పిట్ల సుహాసిని ఓటర్లకు

టీడీపీ, నేతలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధే లక్షంగా పనిచేస్తానని తెలియజేశారు



సూళ్లూరుపేట అర్బన్ నిర్భయవార్త ప్రతినిధి : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి 8784 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించిన పిట్ల సుహాసిని కౌంటింగ్ కేంద్రం లో ధ్రువీకరణ పత్రం అందుకున్న అనంతరం మీడియా తో మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఓటర్ కు ,టీడీపీ నేతలకు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేసారు, మునిసిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేసారు,ఈ సందర్భముగా టీడీపీ అగ్ర నేతలు కొండేపాటి గంగా ప్రసాద్, మీూా నెలవల విజయశ్రీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు, పిట్ల సుహాసిని తో పాటు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్ , తిరుమూరు సుధాకర్ రెడ్డి పలువురు విజయం సాధించిన వార్డ్ కౌన్సిలర్లు పాల్గొని ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు .

కూటమి తరపున బిజెపి యువ నాయకుడు, అందరివాడు, ఆరణి కిషన్ రెడ్డి అభివృద్ధి లక్షంగా అందరి ముందుకు



సూళ్లూరుపేట. నిర్భయవార్త ప్రతినిధి :) సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామానికి చెందిన ప్రముఖ బీజేపీ నేత ఆరణి విజయభాస్కర్ రెడ్డి కుమారుడు బీజేపీ లో యువ నాయకుడుగా పేరు తెచ్చుకున్న ఆరణి కిషన్ రెడ్డి ఇప్పుడు సూళ్లూరుపేట జడ్పీటీసీ స్థానం కు కూటమి పార్టీల మద్దతుతో బీజేపీ నుండి పోటీ చేస్తున్నారు,అందరి వాడుగా ప్రజల మధ్యకు వెళుతూ మండలం లోని గ్రామాల అభివృద్ధి తన లక్షంగా చేసుకొని ప్రజల నుండి విశేష ఆదరణ అందుకుంటూ తన గెలుపు కోసం విస్తృత ప్రచారం సాగిస్తున్న ఆరణి కిషన్ రెడ్డి గెలుపు కోసం శ్రమిస్తున్నారు, గ్రామాల్లో ఉన్న ఎక్కువ శాతం తెలుగుదేశం పార్టీ నేతలంతా కలిసి కిషన్ రెడ్డి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేస్తున్నారు, ప్రముఖ పారిశ్రామిక వేత కొండేపాటి గంగాప్రసాద్ ఆశీస్సులు ,మీూా నెలవల విజయశ్రీ ,మాజీ మీజ వాకాటి నారాయణ రెడ్డి అండదండలతో ప్రజల మధ్యకు వెళ్లి ప్రచారం చేస్తున్న ఆరణి కిషన్ రెడ్డి కి ప్రజల నుండి ఎనలేమి మద్దత్తు లభిస్తుంది.

ఎంపీటీసీ సెగ్మెంట్--1లో సైకిల్ జోరు ఇంటింటికీ ప్రచార హోరు

జడ్పీటీసీ అభ్యర్థి సోనియాతో కలిసి ఎంపీటీసీ అభ్యర్థి గంట మునివేలు ముమ్మర ప్రచారం.



సూళ్లూరుపేట డివిజన్ నిర్భయవార్త ప్రతినిధి : తిరుపతి జిల్లా సత్యవేడులో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.ఇందులో భాగంగా సత్యవేడు పట్టణం ఎంపీటీసీ మొదటి సెగ్మెంట్‌లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గంట మునివేలు ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. జడ్పీటీసీ అభ్యర్థి సోనియాతో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేశారు. తమకు ఒక్క అవకాశం కల్పించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, తమను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తామని అభ్యర్థులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.మొత్తానికి సత్యవేడు పట్టణం ఎంపీటీసీ మొదటి సెగ్మెంట్‌లో ఎన్నికల ప్రచారం ఉత్కంఠగా మారగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

28 వార్డుల్లో 12 స్థానాలు టిడిపి కైవసం.. రెండో స్థానంలో వైఎస్సార్‌సీపీ

చైర్‌పర్సన్‌గా డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా విజయం.. 2,206 ఓట్ల మెజారిటీతో టీడీపీ విజయదుందుభి!



ఆత్మకూరు, నవంబర్ 3 నిర్భయవార్త ప్రతినిధి :ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మొత్తం 28 వార్డులకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా 2,206 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ ఎన్నికలు పట్టణ రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

టీడీపీకి 12 వార్డులు.. వైసీపీకి 9 స్థానాలు!

మున్సిపల్ వార్డుల ఫలితాలను పరిశీలిస్తే తెలుగుదేశం పార్టీ 12 వార్డుల్లో విజయం సాధించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 9 స్థానాలను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 3 వార్డుల్లో గెలుపొందగా, బీజేపీ ఒక వార్డును, సీపీఎం ఒక వార్డును దక్కించుకున్నాయి. ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. మరో వార్డు ఫలితాల పట్టికలో గెలుపు వివరాలు స్పష్టంగా నమోదు కాలేదు.

వార్డుల వారీగా విజేతలు వీరే!

1వ వార్డులో జనసేన అభ్యర్థి కామరిగిరి శాంతికుమార్, 2వ వార్డులో వైసీపీ అభ్యర్థి ఆంధ్ర సుబ్బారెడ్డి, 3వ వార్డులో బీజేపీ అభ్యర్థి నలిశెట్టి శ్రీనివాసులు విజయం సాధించారు. 4వ వార్డులో టీడీపీ అభ్యర్థి షేక్ షాహిన్, 5వ వార్డులో షేక్ నయాబ్ రసూల్, 6వ వార్డులో జనసేన అభ్యర్థి కత్తి పద్మజ, 7వ వార్డులో టీడీపీ అభ్యర్థి పొన్నూరు హరికృష్ణ, 8వ వార్డులో సయ్యద్ మొబినా, 9వ వార్డులో వైసీపీ అభ్యర్థి నాగులపాటి స్వప్న గెలుపొందారు. 10వ వార్డులో టీడీపీ అభ్యర్థి అరిటకుల కృష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 11వ వార్డులో జనసేన అభ్యర్థి కొలగాని శిరీష , 12వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి గడ్డం సంధ్య, 13వ వార్డులో టీడీపీ అభ్యర్థి తొడేటి మాధవీలత, 14వ వార్డులో పచ్చిపాల హరిత, 15వ వార్డులో షేక్ మొహిబుల్లా, 16వ వార్డులో షేక్ ఖైరున్నీసా విజయం సాధించారు. 17వ వార్డులో వైసీపీ అభ్యర్థి దిల్షాద్ మహమ్మద్, 18వ వార్డులో ఆదిలక్ష్మమ్మ, 19వ వార్డులో పఠాన్ సర్దార్ ఖాన్, 20వ వార్డులో యాకసిరి మల్లెం కొండయ్య గెలుపొందారు. 21వ వార్డులో సీపీఎం అభ్యర్థి కొప్పోలు సత్యవతి, 22వ వార్డులో వైసీపీ అభ్యర్థి కవటి సుగుణమ్మ, 23వ వార్డులో నందవరం ప్రసాద్ విజయం సాధించారు. 24వ వార్డులో టీడీపీ అభ్యర్థి తుమ్మల చంద్రారెడ్డి, 25వ వార్డులో వైసీపీ అభ్యర్థి కల్పన యేలంటి గెలుపొందారు. 26వ వార్డులో వైసీపీ అభ్యర్థి మాదాల కృపాకర్‌కు 422 ఓట్లు, టీడీపీ అభ్యర్థి మాదాల శ్రీనివాసులుకు 404 ఓట్లు వచ్చాయి. అయితే ఫలితాల పత్రంలో విజేత వివరాలు నమోదు కాలేదు. 27వ వార్డులో టీడీపీ అభ్యర్థి చెరుకూరు పద్మావతమ్మ, 28వ వార్డులో తొగుంట స్వప్న విజయం సాధించారు.

అభివృద్ధిపై ప్రజల ఆశలు!

మొత్తంగా ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీశాయి. చైర్‌పర్సన్‌గా డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో పట్టణ ప్రజల్లో అభివృద్ధిపై ఆశలు పెరిగాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నికల్లో లభించిన విజయాన్ని ప్రజాసేవకు అంకితం చేస్తూ ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే నూతన పాలకవర్గం ముందున్న ప్రధాన బాధ్యతగా మారింది.

చిత్తూరు ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు నగరం మేయర్గా మెజారిటీతో గెలుపొందిన కటారి హేమలత గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు



చిత్తూరు. నిర్భయవార్త ప్రతినిధి :చిత్తూరు నగరపాలక సంస్థ (కార్పొరేషన్) మేయర్ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన కూటమి అభ్యర్థి శ్రీమతి కటారి హేమలత గారికి చిత్తూరు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) శ్రీ దగ్గుమళ్ల ప్రసాదరావు గారు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చారిత్రాత్మక గెలుపు చిత్తూరు నగర ప్రగతికి సరికొత్త బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ శ్రీ దగ్గుమళ్ల ప్రసాదరావు గారు ఒక ప్రకటన విడుదల చేస్తూ, శ్రీమతి కటారి హేమలత గారి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన తెలుగుదేశం (ణ్ణూ), జనసేన, భారతీయ జనతా పార్టీ (దీజీూ) కూటమి నాయకులకు, కార్యకర్తలకు మరియు శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు.అందరి సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కూటమి ప్రభుత్వానికి జై కొడుతూ.. గౌరవ దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు, మరియు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ బాబు గారి సమర్థవంతమైన నాయకత్వాన్ని బలపరుస్తూ కూటమిని ఆదరించిన చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలందరికీ, అలాగే నా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలోని అశేష ప్రజానీకానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎంపీ పేర్కొన్నారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, చిత్తూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

విన్నమాల సెగ్మెంట్ పరిధిలోని నాలుగు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆధ్వర్యంలో జోరుగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎం,పీ,టీ,సీ ప్రచారం

మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆధ్వర్యంలో పెరికల్లింపాడు కండ్రిగ, కమ్మవారిపాలెం, కారుమంచువారి తండ్రిగ, తిమ్మాజి కండ్రిగలలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం.

తుఫాను వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా క్షేత్రంలో దూసుకెళ్తున్న వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.

విద్యావంతురాలు, సుగుణశీలి తోప్పాని శ్రావణ సంధ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజల పిలుపు.



సూళ్లూరుపేట డివిజన్ నిర్భయవార్త ప్రతినిధి :తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం, విన్నమాల సెగ్మెంట్ పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎం,పీ,టీ,సీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రచార హోరు ముమ్మరంగా సాగుతోంది.ఇందులో భాగంగా పెరికల్లింపాటకండ్రిగ, కమ్మవారిపాలెం, కారుమంచువారి తండ్రిగ, తిమ్మాజి కండ్రిగ అనే నాలుగు గ్రామాలను ఒక కీలక సెగ్మెంట్‌గా మలచుకుని నాయకులు, శ్రేణులు నిరంతరం ప్రజల్లో పర్యటిస్తున్నారు.తుఫానును సైతం లెక్కచేయని ప్రచార జోరుఒకపక్క మురుసు తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నప్పటికీ, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నెల్లూరు వంశీ, అలాగే స్థానిక ప్రముఖ నాయకులు పెరుకులంపాటి మాజీ ఎం,పీ,టీ,సీ హరి రెడ్డి, మాజీ సర్పంచ్ వాకాటి సోమ శేఖర్, తిమ్మాజి కండ్రిగ ప్రకాశ్ తేజ తదితరులు ముందుండి నాయకత్వం వహించారు.విన్నమాల సెగ్మెంట్ పరిధిలోని ఈ నాలుగు గ్రామాల్లో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎం,పీ,టీ,సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోప్పాని శ్రావణ సంధ్య మంచి విద్యావంతురాలు, నిబద్ధత గల వ్యక్తి కావడంతో స్థానికుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.ప్రతి గ్రామంలోనూ ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ, పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు.రాబోయే ఎన్నికల్లో ‘ఫ్యాన్’ గుర్తుపై ఓటు వేసి శ్రావణ సంధ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని గ్రామస్థులు స్పష్టం చేశారు.

జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి గ్రామస్తుల నుంచి అపూర్వ ఆదరణ

బత్తల వల్లం పంచాయతీలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండీల సురేష్ కు ఘన స్వాగతం పలికిన ప్రజలు.



సూళ్లూరుపేట నిర్భయవార్త ప్రతినిధి : తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం పంచాయతీలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ సందర్భంగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి బండిల సురేష్‌కు గ్రామంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, ఆత్మీయంగా ఆహ్వానిస్తూ తమ అభిమానాన్ని, మద్దతును తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బండిల సురేష్ గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రచారం నిర్వహించారు. వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. వరదయ్యపాలెం మండల అభివృద్ధికి తప్పకుండా తన వంతు కృషి చేస్తానని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండిల సురేష్ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు గడపగడపకు వెళ్లి తనని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచుతూ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొప్పన తిలక్ బాబు, మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, హరి, పెద్దిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, గజేంద్ర, ఉజ్వల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్ రమేష్, శీను, ధనపాల్, సుబ్రమణ్యం, మధు, భరత్ జగదీష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో తీవ్ర ఉద్రిక్తత కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులకు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట

మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అరెస్ట్ నేపథ్యంలో భగ్గుమన్న నిరసనలు -- అడ్డగించిన పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం

ఖాకీల ఏకపక్ష వైఖరికి నిదర్శనంగా మారిన ఘర్షణ వాతావరణం -- దద్దరిల్లిన నాయుడుపేట కౌంటింగ్ ప్రాంతం

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న పోలీసుల తీరును ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు





సూళ్లూరుపేట నిర్భయవార్త ప్రతినిధి : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు ఎన్నికల కౌంటింగ్ ఉద్రిక్తతలకు దారితీసింది. ఫలితాల వెల్లడి సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. తొలుత జరిగిన ఓట్ల లెక్కింపులో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించినట్లు అధికారికంగా తేలింది. అయితే, దీనిపై ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రీకౌంటింగ్ కోరడంతో అధికారులు మళ్లీ ఓట్లను లెక్కించారు.ఆరు ఓట్ల తేడాతో ఫలితం తారుమారు.పునఃసమీక్ష అనంతరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కేవలం ఆరు ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ప్రకటించడంపై వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆశ్చర్యం, అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ లెక్కింపు ప్రక్రియపై అనుమానాలు వ్యక్తంచేస్తూ, నిబంధనల ప్రకారం మరోసారి పారదర్శకంగా రీకౌంటింగ్ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత -- మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ ఈ వివాదం ముదిరిన తరుణంలో, పరిస్థితిని సమీక్షించేందుకు మరియు అధికారులతో మాట్లాడేందుకు కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్తున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. ఆయనను బలవంతంగా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయడంతో మున్సిపాలిటీ కార్యాలయం మరియు కౌంటింగ్ కేంద్రం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది.

నాయుడుపేట మున్సిపాలిటీలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మ ఘన విజయం

తెలుగుదేశం పార్టీ అభ్యర్థిపై 1,550 ఓట్ల మెజారిటీతో గెలుపు. :



సూళ్లూరుపేట నిర్భయవార్త ప్రతినిధి : తిరువతి జిల్లా, నూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మ విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిపై 1,550 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంతో నాయుడుపేట పట్టణంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.పార్టీ శ్రేణులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ విజయోత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ్మిరెడ్డి రాజేశ్వరమ్మకు లభించిన ఈ విజయంపై వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, ఓటు వేసి ఆదరించిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 1,550 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం నాయుడుపేట రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

పడమటి నాయుడు పల్లి లో జోరుగా సాగిన ఫ్యాన్ ప్రచారం:

ప్రతి గడపకూ వైఎస్సార్సీపీ ఎంపిటిసి అభ్యర్థి మన్నే రాధమ్మ బృందం.... ప్రచార హీట్ పెంచిన మన్నే వెంకటేశ్వర్లు రెడ్డి.

మర్రిపాడు. నిర్భయవార్త ప్రతినిధి : పడమటి నాయుడు పల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



(వైసీపీ) ఎన్నికల ప్రచార జోరు ఉధృతమైంది. వైస్సార్సీపీ ఎంపిటిసి అభ్యర్థి మన్నే దశరథ రామిరెడ్డి సతీమణి మన్నే రాధమ్మ విజయాన్ని కాంక్షిస్తూ ఆమె బంధుమిత్రులు, పార్టీ శ్రేణులు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు.ప్రచారంలో వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొని పడమటి నాయుడు పల్లి లోని ప్రతి గడపకూ తిరుగుతూ, అభ్యర్థి మన్నే రాధమ్మకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ‘ఫ్యాన్’ గుర్తుకు ఓటు వేసి రాధమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రచార హోరును పెంచారు.వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధికి చేసిన పనులను ఈ సందర్భంగా ప్రచార బృందం ప్రజలకు వివరిస్తోంది. ప్రతి ఇంటి నుంచీ అపూర్వ స్పందన లభిస్తోందని, మన్నే రాధమ్మ గెలుపు ఖాయమని ప్రచారంలో పాల్గొన్న బంధుమిత్రులు, వైస్సార్సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఫ్యాన్ ప్రచార హోరుతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.



ప్రజా సమస్యల పోరాటంలో ‘లెఫ్ట్‌దే రైట్’

రేణిగుంట 3వ సెగ్మెంట్ ఎన్నికల ప్రచారం లో సిపిఎం జోరు!!





రేణిగుంట. నిర్భయవార్త ప్రతినిధి :ప్రజా సమస్యలపై పోరాటంలో వామపక్షాలే సరైన ప్రత్యామ్నాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. సీపీఎం సాగించిన పోరాటాలను వివరిస్తూ మంగళవారం నాడు రేణిగుంట 3వ సెగ్మెంట్‌లో ఎంపీటీసీ అభ్యర్థి బలిపంగి భారతి తరపున పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగేరి పుల్లయ్య, తొట్టంబేడు మండలం బోనువల్లి ఏకగ్రీవ ఎంపీటీసీ సభ్యురాలు చాముండేశ్వరితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. రైల్వే బ్రిడ్జి మూసివేత సమయంలో ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు, మద్యం దుకాణాల తరలింపునకు మహిళల ఆందోళనకు మద్దతు, పేదలకు ఇంటి స్థలాల కోసం పోరాటం, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు, కాలువల సమస్యలపై చేసిన ఉద్యమాలను గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ప్రజాప్రతినిధులు చేసిన కృషిని వివరించారు. భారతిని గెలిపించి రేణిగుంట వాసుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో సీపీఎం సీనియర్ నాయకులు ఓ.వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ రాజేశ్వరి, మాజీ వార్డు సభ్యులు శివానందం, సత్యశ్రీ, పార్టీ నాయకులు వెంకటరమణ, సెల్వరాజు, దీప, మునిస్వామి, చీరాలయ్య, గురుమూర్తి, ఎర్రస్వామి, సుజాతమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన ఐదుగురు మత్స్యకారులు క్షేమం కలెక్టర్ హిమాన్ష శుక్ల





నెల్లూరు, నవంబర్ 3:నిర్భయవార్త ప్రతినిధి :చీరాల మండలం ఓడూరు గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతు కాగా, జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల ఆదేశాల మేరకు మెరైన్ పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో చేపట్టిన గాలింపు, రక్షణ చర్యల ద్వారా వారందరినీ సురక్షితంగా రక్షించి, వారి స్వస్థలాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.చీరాల మండలం ఓడూరు గ్రామానికి చెందిన పిక్కి అప్పలరాజుకు చెందిన ×చీణ-ూ్రా ్ర1 మీ 3025 0001 నంబరు గల ఫిషింగ్ బోటు ఐదుగురు మత్స్యకారులతో కలిసి గత నెల 29వ తేదీన చేపల వేటకు సముద్రంలోకి వెళ్లింది. అయితే, తిరిగి రావాల్సిన సమయానికి బోటు గమ్యస్థానానికి చేరుకోకపోవడంతో బోటు యజమాని సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బోటులోని ఐదుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం మెరైన్ పోలీసులు, ముత్తుకూరు మండల తహశీల్దార్, వారి సిబ్బంది సమన్వయం చేసుకుంటూ..పెట్రోలింగ్ బోటు ద్వారా సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. సముద్రంలో చిక్కుకుని ప్రాణాలతో పోరాడుతున్న ఐదుగురు మత్స్యకారులను గుర్తించి, సురక్షితంగా రక్షించారు. అనంతరం వారిని కృష్ణపట్నం పోర్టుకు తీసుకువచ్చి, మెరైన్ డీఎస్పీ పర్యవేక్షణలో, రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పోర్టులోని సీవీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారి స్వస్థలాలకు సురక్షితంగా పంపించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల తెలిపారు.

సురక్షితంగా రక్షించబడిన మత్స్యకారుల వివరాలు:

1. గరికాన కోదండ -- తండ్రి: దేవుడు, వయస్సు: 30 సంవత్సరాలు. స్వస్థలం: తుని సమీపంలోని రాయినవర. గత 10 సంవత్సరాలుగా ఓడూరులో నివాసం ఉంటున్నారు.
2. మారడ జగన్నాథం -- తండ్రి: కొండయ్య, వయస్సు: 40 సంవత్సరాలు. స్వస్థలం: తుని. గత 10 సంవత్సరాలుగా చీరాల మండలం ఓడూరులో నివాసం ఉంటున్నారు.
3. యరిపిల్లి రమణ -- తండ్రి: తాతయ్య, వయస్సు: 50 సంవత్సరాలు. స్వస్థలం: ఓడూరు, చీరాల మండలం.
4. సొరడ పోలరాజు -- తండ్రి: తాతయ్య, వయస్సు: 30 సంవత్సరాలు. స్వస్థలం: బి.ఎం. చర్చి, కాకినాడ.
5. జి. అప్పారావు -- తండ్రి: వెంకన్న, వయస్సు: 60 సంవత్సరాలు. స్వస్థలం: తుని సమీపంలోని లక్ష్మీపురం. గత 3 సంవత్సరాలుగా ఓడూరులో నివాసం ఉంటున్నారు.

సత్వరమే స్పందించి సమన్వయంతో గాలింపు, రక్షణ చర్యలు చేపట్టి ఐదుగురు మత్స్యకారులను సురక్షితంగా కాపాడిన మెరైన్ పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల ప్రత్యేకంగా అభినందించారు.

నవంబర్ 4, 5 తేదీల్లో పాఠశాలలు యథావిధిగా నిర్వహణ

ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది విధులకు హాజరు కావాలి



నెల్లూరు, నవంబర్ 3:నిర్భయవార్త ప్రతినిధి :నెల్లూరు నగరపాలక సంస్థ పరిధితో పాటు కావలి, గూడూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలు, బుచ్చిరెడ్డిపాలెం, అల్లూరు నగర పంచాయతీల పరిధిలోని అన్ని పాఠశాలలు నవంబర్ 4, 5 తేదీల్లో యథావిధిగా పనిచేస్తాయని జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల ఆమోదంతో జిల్లా విద్యాశాఖ అధికారి డా. రాజా బాలాజీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో బోధనా కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులకు నియమితులైన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది మాత్రం తమకు కేటాయించిన ఎన్నికల విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.ఈ ఆదేశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, పాఠశాలల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నాయుడుపేట 2వ వార్డులో ఎన్నికల ఫలితంపై వివాదం. మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అరెస్ట్

తొలుత వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం
తెలుగు దేశం పార్టీ రీకౌంటింగ్ కోరడంతో ఆరు ఓట్ల మెజారిటీతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపు ప్రకటన



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. ఃతిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీలోని 2వ వార్డు ఎన్నికల ఫలితంపై వివాదం చోటుచేసుకుంది. తొలుత ఓట్ల లెక్కింపులో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రీకౌంటింగ్ కోరడంతో మరోసారి ఓట్ల లెక్కింపు చేపట్టారు.రీకౌంటింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆరు ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ప్రకటించడంతో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో మరోసారి రీకౌంటింగ్ నిర్వహించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించారు.అయితే కౌంటింగ్ కేంద్రం వద్దకు వస్తున్న సంజీవయ్యను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను అరెస్టు చేశారు. ఈ పరిణామంతో నాయుడుపేట మున్సిపాలిటీ 2వ వార్డు వద్ద రాజకీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఓట్ల లెక్కింపు, రీకౌంటింగ్ ప్రక్రియపై అధికారుల వివరణతో పాటు తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

విన్నమాల సెగ్మెంట్ పరిధిలోని నాలుగు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆధ్వర్యంలో జోరుగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎం,పీ,టీ,సీ ప్రచారం

మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆధ్వర్యంలో పెరికల్లింపాడు కండ్రిగ, కమ్మవారిపాలెం, కారుమంచువారి తండ్రిగ, తిమ్మాజి కండ్రిగలలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం
తుఫాను వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా క్షేత్రంలో దూసుకెళ్తున్న వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు
విద్యావంతురాలు, సుగుణశీలి తోప్పాని శ్రావణ సంధ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజల పిలుపు



సూళ్లూరుపేట నిర్భయవార్త ప్రతినిధి :ఃతిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం, విన్నమాల సెగ్మెంట్ పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎం,పీ,టీ,సీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రచార హోరు ముమ్మరంగా సాగుతోంది.ఇందులో భాగంగా పెరికల్లింపాటకండ్రిగ, కమ్మవారిపాలెం, కారుమంచువారి తండ్రిగ, తిమ్మాజి కండ్రిగ అనే నాలుగు గ్రామాలను ఒక కీలక సెగ్మెంట్‌గా మలచుకుని నాయకులు, శ్రేణులు నిరంతరం ప్రజల్లో పర్యటిస్తున్నారు.తుఫానును సైతం లెక్కచేయని ప్రచార జోరుఒకపక్క మురుసు తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నప్పటికీ, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నెల్లూరు వంశీ, అలాగే స్థానిక ప్రముఖ నాయకులు పెరుకులంపాటి మాజీ ఎం,పీ,టీ,సీ హరి రెడ్డి, మాజీ సర్పంచ్ వాకాటి సోమ శేఖర్, తిమ్మాజి కండ్రిగ ప్రకాశ్ తేజ తదితరులు ముందుండి నాయకత్వం వహించారు.విన్నమాల సెగ్మెంట్ పరిధిలోని ఈ నాలుగు గ్రామాల్లో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎం,పీ,టీ,సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోప్పాని శ్రావణ సంధ్య మంచి విద్యావంతురాలు, నిబద్ధత గల వ్యక్తి కావడంతో స్థానికుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.ప్రతి గ్రామంలోనూ ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ, పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు.రాబోయే ఎన్నికల్లో 'ఫ్యాన్' గుర్తుపై ఓటు వేసి శ్రావణ సంధ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించు కుంటామని గ్రామస్థులు స్పష్టం చేశారు.

పడమటి నాయుడు పల్లిలో జోరుగా టీడిపి ఎంపిటీసి అభ్యర్థి పోలిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి ప్రచారం....



మర్రిపాడు: నిర్భయవార్త ప్రతినిధి :మర్రిపాడు మండలం పడమటి నాయుడు పల్లిలో తెలుగుదేశం పార్టీ (టిడిపి) ఎంపిటిసి అభ్యర్థి పోలిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన బంధువులు, పార్టీ కార్యకర్తలు, మరియు నాయకులు జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.రాష్ట్ర మంత్రి రామనారాయణ రెడ్డి ఆశీర్వాదములతో, స్థానిక మాజీ ఎంపిపి కటారి రమణయ్య పూర్తి సహకారంతో ఈ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్తూ ఓటర్లను కలుస్తూ, మల్లికార్జున్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు అభ్యర్థిస్తున్నారు. మాజీ ఎంపిటిసి రమణయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా కదులుతుండటంతో ప్రచారం దూసుకుపోతోంది. స్థానిక ప్రజల నుంచి కూడా అభ్యర్థికి విశేష స్పందన లభిస్తోందని, ఈ ఎన్నికల్లో విజయం ఖాయమని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



'రామాయణ' ప్రీ-సేల్స్: అంతర్జాతీయ మార్కెట్ ప్లస్ అవుతోందా?

భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకున్న -రామాయణ- (పార్ట్ 1) చిత్రం విడుదల ముంగిట సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకున్న -రామాయణ- (పార్ట్ 1) చిత్రం విడుదల ముంగిట సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా ఐదు భారతీయ భాషల (హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం)తో పాటు ఇంగ్లీష్ వెర్షన్‌లోనూ ఈ చిత్రం భారీగా విడుదల కానుంది. రిలీజ్ తేదీ దగ్గరపడుతుండటంతో అడ్వాన్స్



బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ ట్రేడ్ పోర్టల్ సాక్‌నిల్క్ సమాచారం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ప్రీ-సేల్స్ ఇప్పటికే రూ. 85 కోట్లకు చేరువయ్యాయి. భారతదేశంలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. దేశవ్యాప్తంగా తొలి నాలుగు రోజులకు గాను రూ. 48 కోట్ల ప్రీ-బుకింగ్స్ నమోదవగా.. కేవలం మొదటి రోజు ప్రీ-సేల్స్ ద్వారానే దాదాపు రూ. 26 కోట్లు వసూలయ్యాయి. భారతదేశవ్యాప్తంగా ఇప్పటివరకు 11.36 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. ముఖ్యంగా ఐమ్యాక్స్, 4డిఎక్స్ - డాల్బీ సినిమా వంటి ప్రీమియం ఫార్మాట్లలో షోలు వేగంగా హౌస్‌ఫుల్ అవుతుండటంతో ట్రేడ్ వర్గాలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రం భారీ వసూళ్లను సాధిస్తోంది. అంతర్జాతీయంగా అడ్వాన్స్ సేల్స్ 3.5 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 29 కోట్లు) దాటాయి. ముఖ్యంగా అత్యంత కీలకమైన ఉత్తర అమెరికా (ఖూూ ఽ కెనడా) లో ప్రీమియర్ షోల బుకింగ్స్ ఊహించని రీతిలో జోరుగా సాగుతున్నాయి. అక్కడ ఇప్పటికే ప్రధాన నగరాల్లోని థియేటర్లలో ప్రీమియర్ ప్రదర్శనలకు టికెట్లు విపరీతంగా అమ్ముడవుతూ.. భారతీయ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తున్నాయి. దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ మైథాలాజికల్ విజువల్ వండర్ రెండు భాగాల (పార్ట్ 1 ఽ పార్ట్ 2) నిర్మాణానికి, గ్లోబల్ ప్రమోషన్లకు కలిపి మొత్తం రూ. 4,000 కోట్లు (500 మిలియన్ డాలర్లు) భారీ బడ్జెట్‌ని కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో సగం బడ్జెట్ మొదటి భాగానికి ఖర్చవుతుంది. ఆస్కార్ విజేత ణచీజు+ సంస్థ అందించిన విజువల్ ఎఫెక్ట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్‌పై నమిత్ మల్హోత్రా - మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌పై హీరో యాష్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యాష్, హనుమంతుడిగా సన్నీ డియోల్ ..లక్ష్మణుడిగా రవి దూబే నటించారు. అంతేకాకుండా ఆస్కార్ విజేత ఏ.ఆర్.రెహమాన్ .. హాలీవుడ్ లెజెండ్ హాన్స్ జిమ్మర్ కలిసి అందిస్తున్న స్వరాలు ఈ చిత్రానికి అంతర్జాతీయ స్థాయి ప్రాముఖ్యతను తీసుకువచ్చాయి. అన్ని రకాల హంగులతో నవంబర్ 5న విడుదలవుతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పడం ఖాయంగా కనిపిస్తోంది. భారతీయ పురాణేతిహాసాలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గౌరవం, రామాయణం అసాధారణమైన కథకు దక్కుతున్న గౌరవంగా దీనిని భావించాలి.

కత్తులతో కాళికావతారం..

రష్మిక 'మైసా' పూనకాలు మామూలుగా లేవుగా!

రష్మిక మందన్న కెరీర్ లో ఎప్పుడూ చూడని కొత్త అవతారం ఇది. గ్లామర్ పాత్రలతో అలరించిన ఈ కన్నడ బ్యూటీ, మొదటిసారి పూర్తి స్థాయి లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా మైసా తో పాన్ ఇండియా రేంజ్ లో అదృష్టాన్ని పరీక్షిం చుకుంటోంది. దీ రష్మిక మందన్న కెరీర్ లో ఎప్పుడూ చూడని కొత్త అవతారం ఇది. గ్లామర్ పాత్రలతో అలరించిన ఈ కన్నడ బ్యూటీ, మొదటిసారి పూర్తి స్థాయి లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా మైసా తో పాన్ ఇండియా రేంజ్ లో అదృష్టాన్ని పరీక్షిం చుకుంటోంది. లేటెస్ట్ గా ఈ సినిమా నుంచి వచ్చిన



మొదటి పాట ఓ మైసా రే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. చేతిలో కత్తులు, ఒంటిపై రక్తపు మరకలతో రష్మిక ఇచ్చిన ఎంట్రీ చూస్తుంటే సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో అర్థమవుతోంది. దర్శకుడు రవీంద్ర పుల్లె ఈ పాటను పిక్చరైజ్ చేసిన విధానం చాలా రా అండ్ రస్టిక్ గా ఉంది. దుష్టశక్తులపై పోరాటానికి దిగేముందు జరిగే ఒక గిరిజన పూజా విధానంలా ఈ పాట హైలెట్ అయ్యింది. నిప్పుల మధ్య రౌద్ర రూపంతో రష్మిక చేసిన క్లాసికల్ తరహా నృత్య భంగిమలు గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. కాళికా మాత ఆవహించినట్లు ఆమె పలికించిన హావభావాలు, చూపులు ఆడియన్స్ ను వెంటనే ఆకట్టుకుంటున్నాయి. ఆమె చేసిన గత సినిమాలకు ఇది పూర్తి భిన్నమైన రోల్. సంగీత దర్శకుడు జేక్స్ బిజాయ్ అందించిన ట్యూన్ పాటకు అసలైన ప్రాణం పోసింది. అడవి బిడ్డల సంస్కృతిని ప్రతిబింబించే లోకల్ వాయిద్యాలను వాడుతూ ఆయన క్రియేట్ చేసిన బ్యాక్‌గ్రౌండ్ రిథమ్ హై ఓల్టేజ్ వైబ్ ను తీసుకొచ్చింది. సింగర్ సింధుజ శ్రీనివాసన్ తన పవర్ ఫుల్ వాయిస్ తో పాటకు కావాల్సిన పవర్ ను అందించారు. వింటుంటేనే ఒంట్లో తెలియని ఒక వైబ్రేషన్ కలిగేలా మ్యూజిక్ సాగింది. సుద్దాల అశోక్ తేజ రాసిన సాహిత్యం పాటలోని భావోద్వేగాన్ని మరింత ఎలివేట్ చేసింది. శత్రువుల గుండెల్లో భయం పుట్టించేలా, న్యాయం కోసం పోరాడే ఒక వీరనారి ఆవేశాన్ని ప్రతిబింబించే పదాలతో పాటను తీర్చిదిద్దారు. తెలంగాణ జానపద యాసతో కూడిన పదాల అమరిక సన్నివేశానికి పక్కాగా సరిపోయింది. కేవలం ఆడియో విన్నప్పుడే కాకుండా, స్క్రీన్ పై విజువల్స్ తో చూసినప్పుడు ఈ లైన్స్ ఇచ్చే ఇంపాక్ట్ ఇంకాస్త ఎక్కువగా అనిపిస్తుంది.బృందా మాస్టర్ కొరియోగ్రఫీ ఇందులో స్పెషల్ గా నిలిచింది.

సెలబ్రిటీల భద్రతపై చిరంజీవి కీలక అడుగు..

కేంద్రం దృష్టికి సమస్య!

సినిమా నటీనటులపై ఏఐ (ూ×) టెక్నాలజీతో జరుగుతున్న డీప్‌ఫేక్ దాడులపై మెగాస్టార్ చిరంజీవి గట్టిగా స్పందిస్తున్నారు. సినిమా నటీనటులపై ఏఐ (ూ×) టెక్నాలజీతో జరుగుతున్న డీప్‌ఫేక్ దాడులపై మెగాస్టార్ చిరంజీవి గట్టిగా స్పందిస్తున్నారు. సెలబ్రిటీల ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా చిరంజీవి తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆయన తనయుడు రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు. ఈరోజు చిరంజీవి అమిత్ షా ని కలవగా.. సాయంత్రం నుంచి వీరిద్దరూ దేని గురించి మాట్లాడుకున్నారు అన్న ప్రశ్న కామెంట్ల రూపంలో సోషల్ మీడియా మొత్తం వెల్లువెట్టింది. అయితే దీనిపై ఫైనల్ గా క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి నకిలీ వీడియోలు సృష్టించడం పెరిగిపోయింది. ముఖ్యంగా సినీ నటీమణుల ఫొటోలు, వీడియోలను అసభ్యకరంగా మార్చి ప్రచారం చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ఘటనలు బాధితుల వ్యక్తిగత జీవితాలను, గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ విషయంపై చిరంజీవి గతంలోనే సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తం చేశారు. అయితే..కేవలం పోస్టులకే పరిమితం కాకుండా ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో అమిత్ షాను కలిసి డీప్‌ఫేక్ టెక్నాలజీ దుర్వినియోగం గురించి చిరంజీవి వివరించారు. తెలుగు సినీ పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న నటీనటులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. ఏఐ పేరుతో ఇతరుల గౌరవానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు బలమైన చట్టాలు రూపొందించాలని చిరంజీవి కోరినట్లు తెలుస్తోంది. చిరంజీవి, రామ్ చరణ్ లేవనెత్తిన అంశాలను అమిత్ షా



సానుకూలంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఆయన భరోసా ఇచ్చినట్లు సమాచారం. అలాగే.. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందించాలని సూచించారంట. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను సమన్వయం చేసే బాధ్యతను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అప్పగించినట్లు తెలుస్తోంది. అమిత్ షా సానుకూలంగా స్పందించడంతో చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ బాధితులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వెండితెరపై హ్యాట్రిక్ కొట్టిన టాలీవుడ్ సెలబ్రిటీ రియల్ జోడీలివే!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో రీల్ లైఫ్ జోడీలుగా అలరించి, ఆపై నిజజీవితంలో కూడా భార్యాభర్తలుగా మారి అందరినీ ఆకట్టుకున్నారు



ఎంతోమంది సెలబ్రిటీలు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో రీల్ లైఫ్ జోడీలుగా అలరించి, ఆపై నిజజీవితంలో కూడా భార్యాభర్తలుగా మారి అందరినీ ఆకట్టుకున్నారు ఎంతోమంది సెలబ్రిటీలు. అయితే అలాంటి సెలబ్రిటీలు వెండితెరపై అద్భుతమైన కెమిస్ట్రీతో వరుస విజయాలను అందుకొని అభిమానులను అలరించారు. అలాంటి జోడీలలో ప్రత్యేకించి కొన్ని జంటల గురించి ఇప్పుడు చర్చించుకుందాం. ముఖ్యంగా వెండితెరపై తమ అద్భుతమైన ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా.. హ్యాట్రిక్ అందుకొని రికార్డు సృష్టించారు. మరి అలా వెండితెరపై హ్యాట్రిక్ కొట్టిన టాలీవుడ్ సెలబ్రిటీ రియల్ జోడీలు ఏవో ఇప్పుడు చూద్దాం. అక్కినేని నాగార్జున - అమల: దివంగత లెజెండ్రీ నటులు అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగపెట్టిన నాగార్జున తనదైన నటనతో మాస్ హీరోగా, కింగ్ గా, మన్మధుడిగా ఇలా అభిమానుల చేత పిలిపించుకుంటూ అందరిని ఆకర్షించారు. విలక్షణమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈయన ప్రముఖ సినీ నటి అమలను ప్రేమించి మరీ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇకపోతే టాలీవుడ్ లో ఒకప్పటి మోస్ట్ రొమాంటిక్ రియల్ లైఫ్ కపుల్ గా గుర్తింపు తెచ్చుకున్న ఈ జంట బాక్స్ ఆఫీస్ వద్ద కూడా తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇకపోతే వీరిద్దరూ కలిసి హ్యాట్రిక్ కంటే కూడా ఎక్కువ హిట్లే అందుకోవడం గమనార్హం. అలా వీళ్ళిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'శివ' మూవీ ఇండస్ట్రీ హిట్గా నిలవడమే కాకుండా ట్రెండ్ సెట్టర్గా కూడా నిలిచింది. ఇక తర్వాత వచ్చిన 'కిరాయి దాదా' సూపర్ హిట్ గా నిలవగా, 'నిర్ణయం' సినిమా మంచి విజయం అందుకుంది అంతేకాదు వీరిద్దరి కాంబినేషన్లో 'ప్రేమ యుద్ధం','చిన్నబాబు' వంటి చిత్రాలు కూడా మంచి విజయాన్ని అందుకున్నాయి. అక్కినేని నాగచైతన్య - సమంత: నాగార్జున వారసుడిగా వెండితెరపై ప్రేక్షకులను అలరించిన అక్కినేని నాగచైతన్య.. తన భార్య సమంతకు విడాకులు ఇవ్వకముందు అద్భుతమైన కెమిస్ట్రీ తో వరుస విజయాలు అందుకున్నారు. ముఖ్యంగా వీరు కలిసి నటించిన సినిమాలతో హ్యాట్రిక్ కూడా అందుకున్నారు. ఇక వీళ్లిద్దరి కాంబినేషన్లో వచ్చిన తొలి సినిమా 'ఏ మాయ చేసావే'. ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ఆ తర్వాత వచ్చిన 'మనం' చిత్రం బ్లాక్ బాస్టర్ కాగా, వివాహం తర్వాత వీళ్ళిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'మజిలీ' సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. అంతేకాదు వీళ్ళిద్దరూ కలిసి 'ఆటో నగర్' సూర్య సినిమాలో కూడా కలిసి నటించారు. శ్రీకాంత్ - ఊహ: 90వ దశకంలో శ్రీకాంత్ , ఊహల కాంబినేషన్ వెండితెరపై ఒక వెలుగు వెలిగింది. వీరి కాంబినేషన్లో వచ్చిన దాదాపు అన్ని చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. ముఖ్యంగా వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన ఆమె అల్లరి మొగుడు, కూతురు వంటి చిత్రాలు ఘనవిజయం సొంతం చేసుకున్నాయి. రాజశేఖర్ - జీవిత: రాజశేఖర్ - జీవితలది కూడా వెండితెరపై విజయవంతమైన కాంబినేషన్. పెళ్లికి ముందు, ఆ తర్వాత వీరు కలిసి చేసిన సినిమాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. 'అంకుశం', 'మగాడు','ఆహుతి ' వంటి చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న: అద్భుతమైన ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీతో వెండితెరపై సంచలనం సృష్టించిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తొలిసారి 'గీతాగోవిందం' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆ తర్వాత వచ్చిన 'డియర్ కామ్రేడ్' చిత్రం కూడా మంచి విజయం అందుకుంది. ఇక వివాహం తర్వాత నటించిన 'రణబాలి' సినిమా కూడా మంచి విజయం అందుకుంది. వీరితో పాటు మరికొన్ని జంటలు రియల్ జోడీలుగా గుర్తింపు తెచ్చుకొని.. అటు వెండితెరపై కూడా హ్యాట్రిక్ సొంతం చేసుకున్నాయి.

షారుఖ్ 'కింగ్' విజువల్స్ పై విమర్శలు!

బాలీవుడ్ కా బాద్షా షారుఖ్ ఖాన్ హీరోగా దీపికా పదుకోణ్ హీరోయిన్ గా అక్కడి స్టార్ యాక్షన్ సినిమాల దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ కలయికలో చేస్తున్న అవైటెడ్ సినిమానే కింగ్. భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా నుంచి రీసెంట్ గా ఓ సాంగ్ ని సర్ప్రైజింగ్ గా విడుదల చేశారు. అయితే ఈ సాంగ్ కి పాజిటివ్ రెస్పాన్స్ పక్కన పెడితే ఇందులో విజువల్స్ చూసి అంతా షాక్ అవుతున్నారు.సినిమాలు చూడండిఈ సాంగ్ లో చాలా చోట్ల బ్యాక్గ్రౌండ్ విజువల్స్ కోసం అంతా మాట్లాడుతున్నారు. అసలు ఇది ఓ స్టార్ హీరో సినిమాకి ఇవ్వాల్సిన అవుట్ పుటేనా అంటూ విమర్శలు చేస్తున్నారు. నాసిరకం బ్యాక్గ్రౌండ్ విజువల్స్ ఏంటని నెటీజన్స్ ఇపుడు సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు. దీనితో కింగ్ మేకర్స్ పై ఇప్పుడు గట్టి విమర్శలు పడుతున్నాయి. మరి వీటిని మరింత మెరుగ్గా చేస్తారో లేదో చూడాలి.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197